సాక్షి నిర్మల్

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



స్వీయ ఆవిష్కరణకు టెక్నాలజీ తోడవ్వాలి

10లో▸

స్వీయ ఆవిష్కరణకు సాంకేతికత తోడవ్వాలని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి పేర్కొన్నారు. ఆర్జీయూకేటీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సర్వ శిక్ష ఉద్యోగుల నిరసన

నిర్మల్ రూరల్: రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కొద్దిరోజులుగా జిల్లా కేంద్రంలో దీక్ష చేపట్టిన సర్వ శిక్ష ఉద్యోగులు బుధవారం శిబిరం వద్ద గులాబీ బెలూన్లతో నిరసన తెలిపారు. శిబిరాన్ని సారంగపూర్ మండలం స్వర్ణ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, కుంటాల మండల పీఆర్టీయూ నాయకులు, నిర్మల్ మండలం చిట్యాల పీజీహెచ్ఎం వెంకటేశ్వర్లు సందర్శించారు. వారికి సంఘీభావం ప్రకటించారు.

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో గాలివాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఎస్జీఎఫ్ కార్యదర్శిగా పీడీ బాబురావు



బాబురావుకు ఉత్తర్వు ఇస్తున్న శైలజ

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్–19 ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పీడీ బాబురావును నియమించినట్లు డీఐఈవో శైలజ తెలిపారు. 2023–25 విద్యా సంవత్సరానికి గాను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమించామని పేర్కొన్నారు. జిల్లా క్రీడా సమాఖ్య అండర్–19 చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్, అధ్యక్షురాలిగా డీఐఈవో, కార్యదర్శిగా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ బాబురావు వ్యవహరిస్తారని తెలిపారు.

జూనియర్ కళాశాల తనిఖీ



మాట్లాడుతున్న పరశురాంనాయక్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం డీఐఈవో పరశురాం నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకుల హాజరును పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. సిలబస్ వివరాలు తెలుసుకున్నారు. కళాశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. డీఐఈవో వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రజిత, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌రెడ్డి తదితరులున్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరినవారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: సారంగపూర్ మండలం బీరవెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బ్యాగరి ఎల్లన్న, ముఖ్యనాయకులు నిమ్మల రాజన్న, కురిమే పండరితోపాటు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించిన స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నాయకులు కరిపే విలాస్, నాయక సాహెబ్‌రావ్, నారాయణ, బలాష్టు రాజేశ్వర్, నవీన్, నారాయణ్‌రెడ్డి, మచ్చందర్‌రెడ్డి, ప్రసాద్, వెల్మల నవీన్, ప్రశాంత్, నిమ్మల శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి, బ్యాగరి చిన్న సాయన్న తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీఆర్వో లోకేశ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ముందుగా సమ్మె శిబిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజమణి మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షులు శైలజ, విజయ, గంగామణి, రజియా, భాగ్య, స్వర్ణలత, రేష్మ, అనురాధ, వనజ, దేవిక, రమ్య, లావణ్య, ఏఐటీయూసీ నాయకులు ఎస్ఎస్ రెడ్డి, ఉపాలి, యూనియన్ నాయకులు పద్మ, హేమలత పాల్గొన్నారు.

అసమ్మతి ఆగినట్లేనా..!



కేటీఆర్‌తో మంత్రి అల్లోల, నిర్మల్ నేతలు

- కేటీఆర్‌ను కలిసిన ముథోల్ నేతలు
- ఎమ్మెల్యేకు సహకరించాలన్న మంత్రి
- అందరి పనులు చేయిస్తామని హామీ
- ఖానాపూర్ పంచాయితీ సంగతేందో..!



మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ముథోల్ నియోజకవర్గ అసమ్మతి నేతలు

నిర్మల్: ఎన్నికలకు మూణ్నెళ్ల ముందే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్‌కు సొంత పార్టీలోనే అసమ్మతి ఎదురైంది. ఖానాపూర్‌లో సీటు దక్కకపోవడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీలో ఉంటూ రెబల్‌గా పోటీచేస్తానంటున్నారు. ఇక ముథోల్ నియోజకవర్గంలో స్వపక్షంలోనే పలువురు సీనియర్లు, జెడ్పీటీసీ సభ్యులు అసమ్మతివర్గంగా తయారయ్యారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి టికెట్ ఇవ్వొద్దంటూ ఆయనకు వ్యతిరేకంగా ర్యాలీలు, కార్యక్రమాలు, సమావేశాలు చేపడుతూ బలప్రదర్శన నిర్వహించారు. ఓ దశలో నియోజకవర్గంలో పార్టీ రెండుగా చీలినట్లు తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో మరో ఐదారురోజుల్లో మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాకు రానున్నారు. ఈనేపథ్యంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ముథోల్ అసమ్మతివర్గంతో ఆయన మాట్లాడారు.

అభ్యర్థి మార్పు ఉండదు..

పార్టీ ఒక్కసారి డిసైడ్ చేసిన తర్వాత అభ్యర్థిని మార్చే ప్రసక్తి ఉండదని మంత్రి కేటీఆర్ తేల్చిచెప్పారు. ముథోల్ అభ్యర్థిగా ప్రకటించిన విఠల్‌రెడ్డిని మార్చాలంటూ కొంతకాలంగా అసమ్మతి నేతలు ఒత్తిడి తీసుకువచ్చారు. ఈక్రమంలో మంగళవారం తన వద్దకు వచ్చిన సదరు నేతలకు అభ్యర్థి మార్పు ఉండదన్న విషయాన్ని కేటీఆర్ స్పష్టంచేశారు. పార్టీతో రెండుసార్లు, ప్రైవేట్‌గా రెండుసార్లు సర్వేలు చేయించిన తర్వాతే సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారని చెప్పారు. ఈ సర్వేల్లో ముథోల్ నియోజకవర్గంలో విఠల్‌రెడ్డి గెలుస్తారన్న విషయం తేలిందని, ఈమేరకు ఆయనకు అభ్యర్థిత్వాన్ని ప్రకటించామని చెప్పారు. ఒక్కసారి పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత మళ్లీ మార్పు ఉండదన్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. జిల్లాలో తన పర్యటన తర్వాత మరోసారి ముథోల్ నేతలతో కలుస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేనే వచ్చి కలుస్తారు..

ముథోల్‌లో బీఆర్ఎస్ గెలిచేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని, వేర్వేరుగా కాకుండా అందరూ సమష్టిగా పనిచేయాలని కేటీఆర్ సూచించారు. సీనియర్లందరూ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి సహకరించాలని, పార్టీని గెలిపించాలని సూచించారు. ఇక అసమ్మతి నేతల వాదనలు విన్న ఆయన త్వరలోనే ఎమ్మెల్యే విఠల్‌రెడ్డినే అందరి వద్దకు వచ్చి కలుస్తారని, మీకు సంబంధించిన పనులనూ పూర్తిచేసేలా చూస్తారని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ప్రతి హామీకి సానుకూలం..

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ హామీల పరంపర కొనసాగుతోంది. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు కావాలంటూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌కు విన్నవించారు. నిర్మల్ నియోజకవర్గంలో పొన్కల్ మండలం ఏర్పాటు, నిర్మల్ మున్సిపాలిటీకి నిధులపైనా ఆయన సానుకూలంగా స్పందించినట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈనెల 25 లేదా 26వ తేదీన జిల్లాకు వస్తున్న కేటీఆర్ చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. ఇదే సమయంలో మరిన్ని పనులకు సంబంధించి నిధుల విడుదలపైనా ప్రకటన చేయించేందుకు ముందస్తుగా విన్నవించారు. ఈమేరకు మంత్రి కేటీఆర్ కూడా సానుకూలంగా స్పందించడంతో జిల్లా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖానాపూర్‌లో రెబల్..

బీఆర్ఎస్‌లో ముథోల్ పంచాయితీ తేలినప్పటికీ ఖానాపూర్ లొల్లి మాత్రం ముదురుతూనే ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కాదని, కేటీఆర్ మిత్రుడు జాన్సన్‌నాయక్‌కు టికెట్ కేటాయించారు. ఆయన రోజురోజుకూ ప్రచారజోరు పెంచుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే రేఖానాయక్ స్వపక్షంలోనే కొనసాగుతూ విపక్షంలా ఆరోపణలు చేస్తున్నారు. తనకు టికెటివ్వకున్నా తాను మాత్రం పార్టీమారనని, 'కారు'లోనే ఉంటూ రెబల్‌గా పోటీ చేస్తానని హెచ్చరిస్తున్నారు.

ముగిసిన రీ ఎగ్జామినేషన్



అర్హత పత్రాలు తనిఖీ చేస్తున్న వైద్యులు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల రీ ఎగ్జామినేషన్ బుధవారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాథోడ్ సునీల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు తనిఖీ చేశారు. ప్రత్యేక కేటగిరీ కింద ఫిజికల్ హ్యాండీక్యాప్డ్, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ డయాలసిస్, డిపెండెంట్ ఎమ్మార్ చిల్డ్రన్, డిపెండెంట్ జువెనైల్ డయాబెటిక్ చిల్డ్రన్ తదితర ప్రాధాన్యతలు పెట్టుకున్న ఉపాధ్యాయులకు రీ ఎగ్జామినేషన్ నిర్వహించారు. మొత్తం 67 మంది దరఖాస్తు చేసుకోగా ఇద్దరు గైర్హాజరయ్యారు. కొందరిని గురువారం ఏరియా ఆస్పత్రికి వచ్చి ఇతర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, వైద్యులు ప్రమోద్‌చంద్రారెడ్డి, అల్లాడి సురేశ్, మెడికల్ ఆఫీస్ సూపరింటెండెంట్ నవీన్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొనికి వనం పరిశీలన



వనాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

మామడ: లింగాపూర్‌లోని పొనికి వనాన్ని డీఆర్డీవో విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. మొక్కల సంరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఎంపీడీవో రమేశ్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, పంచాయతీ కార్యదర్శులు రాణి, సురేశ్ ఉన్నారు.

రేషన్‌కార్డులెప్పుడిస్తరో..!

- ఏడేళ్లుగా నిరీక్షిస్తున్న నిరుపేదలు
- జిల్లాలో 13,220 మంది అర్హులు
- పథకాలు అందక ఇబ్బందులు



వేలాది దరఖాస్తుల తిరస్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే తెల్లరేషన్ కార్డు తప్పనిసరి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదు. 2016లో మాత్రం ఆహార భద్రత కార్డులు జారీ చేసింది. ఆ సందర్భంలో చాలామంది కొత్తగా కార్డులు, పేర్ల మార్పిడి, పిల్లల పేర్ల నమోదు చేయించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయినా చాలామందికి కొత్తగా రేషన్‌కార్డులు అందని పరిస్థితి. ఆ తరువాత ప్రభుత్వం రేషన్ కార్డులకు సంబంధించి ఆన్‌లైన్‌లో సైట్ క్లోస్ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే అధికారులు రేషన్‌కార్డు తప్పనిసరి అని చెబుతుండడంతో చాలామంది పేదలు వీటికి దూరమవుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు సొంతిల్లు నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థికసాయం చేయనుంది. ఇందుకోసం ఇటీవల జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించగా 53,334 వచ్చాయి. అందులో నియోజకవర్గానికి మూడువేల మందికి ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది వేల మంది మొదటి విడతలో లబ్ధి పొందనున్నారు.

పథకాలు పొందలేకపోతున్నం



నాకు 2018లో వివాహమైంది. 2019లో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్న. ఇప్పటిదాకా కార్డు రాలేదు. దీంతో బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేయలేదు. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్‌కార్డు తప్పనిసరి చేశారు. మాలాంటి పేదలకు అవి పంపిణీ చేయకపోవడంతో సంక్షేమ ఫలాలు అందుకోలేకపోతున్నం.

– పుప్పాల మహేందర్, పెంబి

అయితే ఈ పథకానికి వచ్చిన మొత్తం దరఖాస్తులను పరిశీలించి 7,800 మందిని మాత్రమే అధికారులు అర్హులుగా తేల్చారు. ఇందులో తెల్లరేషన్ కార్డులు లేక చాలామంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. కాగా, బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించింది. ఈ పథకానికి 14,521 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కూడా వేలాదిమంది రేషన్‌కార్డులు లేని వారి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. వీటితోపాటు మైనార్టీ బంధు పథకంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డులు లేక తాము ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్‌కార్డులతోపాటు పేర్ల మార్పు, కొత్తగా పిల్లల పేర్లు నమోదు చేసి కొత్త కార్డులు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

మండలాలవారీగా పెండింగ్ దరఖాస్తులు, వాటి స్థితిగతులు

మండలం	దరఖాస్తులు	యూనిట్లు	అనుమతి	తిరస్కరణ
బాసర	407	1,102	295	112
భైంసా	3,053	8,125	2,835	218
దస్తురాబాద్	302	693	256	46
దిలావర్‌పూర్	216	561	200	16
కడెం పెద్దూర్	671	1,625	564	107
ఖానాపూర్	1,191	2,967	1,096	95
కుభీర్	645	1,633	502	143
కుంటాల	284	717	244	40
లక్ష్మణచాంద	475	1,131	310	165
లోకేశ్వరం	513	1,231	431	82
మామడ	720	1,909	680	40
ముథోల్	761	1,975	606	155
నర్సాపూర్ (జీ)	319	799	280	39
నిర్మల్‌రూరల్	537	1,332	466	71
నిర్మల్ అర్బన్	2,354	6,210	2,164	190
పెంబి	270	704	242	28
సారంగపూర్	932	2,464	818	114
సోన్	504	1,264	470	34
తానూర్	1,031	2,727	761	270

జిల్లాలో రేషన్‌షాపులు, కార్డుల వివరాలు

రేషన్ షాపులు	412
అంత్యోదయ కార్డులు	12,487
ఆహారభద్రత కార్డులు	1,96,223
అన్నపూర్ణ కార్డులు	33
మొత్తం కార్డులు	2,08,743
మొత్తం యూనిట్లు	6,44,249
కార్డు కోసం వచ్చిన దరఖాస్తులు	15,185
యూనిట్లు	39,169
అనుమతించినవి	13,220
తిరస్కరించినవి	1,965

తిరస్కరించినవారిని జాబితా నుంచి తొలగించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ ప్రమోషన్ వద్దని రెండుసార్లు తిరస్కరించిన వారిని ఎస్టీటీ, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ప్రమోషన్ జాబితా నుంచి తొలగించాలని యూఎస్పీఎస్సీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈవో రవీందర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గవర్నమెంట్ ఉత్తర్వు నంబర్ 145 ప్రకారం ప్రమోషన్లు రెండు సందర్భాల్లో వద్దని నాట్ విల్లింగ్ రాతపూర్వకంగా ఇచ్చిన వారిని తదుపరి ప్రమోషన్ నుంచి తీసివేయాలని కోరారు. అర్హులైన ఇతర అభ్యర్థులను జాబితాలో చేర్చాలని విన్నవించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జుట్టు గజేందర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య రాజేశ్‌నాయక్, మేవా సంఘం జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ అలీ, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులున్నారు.

మంత్రి ఐకేరెడ్డిని కలిసిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నిర్మల్ రూరల్: రెగ్యులరైజ్ చేయాలని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు బుధవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఐకేరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రిని కలిసినవారిలో ఉద్యోగ సంఘం నాయకులు భూసారపు గంగాధర్, గాంధారి రత్నం, ఠాగూర్ గజేందర్‌సింగ్, కప్పకంటి సుధాకర్, దర్శనం నరేశ్, బాలేరావ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అందులో ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించకపోవడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం కులగణన చేయకపోవడంతో 70 ఏళ్లుగా బీసీల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తంజేశారు. ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

అర్హులకు లబ్ధి చేకూర్చాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీవో 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయం, సబ్సిడీ గొర్రెల పంపిణీ, దళితబంధు తదితర పథకాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆసరా పెన్షన్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా తక్షణమే పరిశీలించి అర్హుల జాబితా పంపించాలని, గొర్రెల పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు. బీసీ కుల వృత్తుల వారికి, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయానికి సంబంధించి నిర్ణీత లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అర్హుల జాబితాను అప్లోడ్ చేయాలని సూచించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

24న నెట్‌బాల్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 24న జిల్లాస్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధానకార్యదర్శి మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2008లోపు జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు సంబంధిత పత్రాలతో రావాలని, పూర్తి వివరాలకు 80088 24420 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆరుగురే మహిళా ఎమ్మెల్యేలు!

- ఉమ్మడి జిల్లా నుంచి చట్టసభల్లో 'ఆమె'కు దక్కిన అదృష్టం
- ఏడు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానంలో నేటికీ రాని అవకాశం
- ప్రస్తుతం పదింటిలో ఒక్కరే శాసనసభ్యురాలిగా ప్రాతినిధ్యం
- 'మహిళా బిల్లు'తో భవిష్యత్‌లో మారనున్న రాజకీయం



పాటి సుభద్ర



పాల్వాయి రాజ్యలక్ష్మి



అమురాజుల శ్రీదేవి



సుమన్ రాథోడ్



కోవ లక్ష్మి



రేఖానాయక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచాలని 33శాతం సీట్లు రిజర్వు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 128వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడంతో రాజకీయంగా మహిళా ప్రాతినిధ్యంపై చర్చ మొదలైంది. ఈ బిల్లు వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాకున్నా.. 2029 ఎన్నికల వరకు అమలయ్యే అవకాశం ఉంది. ఈ చట్టం కార్యరూపం దాల్చితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది శాసనసభ స్థానాలు, రెండు లోకసభ స్థానాల్లో మహిళలకు రాజకీయంగా అవకాశాలు మెరుగుపడనున్నాయి.

గత 70ఏళ్ల ఎన్నికల గణాంకాలు పరిశీలిస్తే.. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో ఒక్కో స్థానం నుంచి 15మంది చొప్పున దాదాపు 150పైగా మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కానీ వీరిలో ఆరుగురు మహిళలకు మాత్రమే చట్ట సభల్లోకి వెళ్లే అదృష్టం దక్కింది. పది స్థానాల్లో ఆసిఫాబాద్, సిర్పూర్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచే ఆరుగురు ఎమ్మెల్యేలుగా ఉండడం గమనార్హం. ఇక ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పెద్దపల్లి, ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాలకు 36మంది ఎంపీలుగా ఎన్నిక కాగా, ఇందులో పెద్దపల్లి నుంచి సుగుణకుమారి 1998లో 12వ లోక్‌సభకు ఒక్కసారి ఎన్నికయ్యారు.

ఆసిఫాబాద్ నుంచే ఆరంభం

ఉమ్మడి జిల్లా నుంచి తొలిసారిగా ఓ మహిళ ఎమ్మెల్యేగా ఎన్నికైంది ఆసిఫాబాద్ నుంచే. 1999లో ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో తాండూరు జెడ్పీటీసీగా ఉన్న భర్త, వెంకటకృష్ణయ్య ప్రోత్సాహంతో వైద్యురాలైన పాటి సుభద్ర తెలుగుదేశం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2004లో అమురాజుల శ్రీదేవి టీడీపీ నుంచే గెలిచారు. టీఆర్ఎస్ నుంచి 2014లో కోవ లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ ఒక్క స్థానం నుంచే ముగ్గురు మహిళలు శాసనసభ్యులుగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత బెల్లంపల్లి ఏర్పడ్డాక, 2009లో ప్రజారాజ్యం నుంచి అమురాజుల శ్రీదేవి, 2014లో తెలుగుదేశం నుంచి పాటి సుభద్ర పోటీ చేసి ఓడిపోయారు.

సిర్పూర్ నుంచి పాల్వాయి రాజ్యలక్ష్మి

1999 సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికలకు మూడు రోజుల ముందు నక్సలైట్ల చేతిలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు ప్రాణాలు కోల్పోయారు. ఆ స్థానంలో ఆయన సతీమణి రాజ్యలక్ష్మికి టీడీపీ టికెట్ ఇచ్చింది. అలా అనూహ్యంగా ఆ స్థానం మహిళకు దక్కింది. 2004లో మళ్లీ పోటీ చేయగా రెండో స్థానంలో నిలిచారు.

ఖానాపూర్ నుంచి ఇద్దరు

2008లో తెలంగాణ ఉద్యమ సమయంలో వచ్చిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి సుమన్ రాథోడ్ గెలుపొందారు. ఆ తర్వాత 2009లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆమె సామాజికవర్గంపై వివాదం రావడం, కోర్టు కేసులతో రాజకీయంగా ఇబ్బంది ఎదురైంది. ఈ మహిళా స్థానాన్ని మళ్లీ 2014, 2018లో రేఖానాయక్ భర్తీ చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి ఏకైక మహిళా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

సగం ఓట్లు వారివే.. అవకాశాలే తక్కువ

1952 నుంచి 2018మధ్య 15సార్లు ఒక్కో నియోజకవర్గం నుంచి 15మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కొన్ని చోట్ల ఉప ఎన్నికలు కూడా వచ్చాయి. అయితే ఆసిఫాబాద్, ఖానాపూర్, సిర్పూర్ మినహా ఎక్కడా మహిళలకు అవకాశాలు రాలేదు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నుంచి మహిళా నాయకులు ఒక్కరు కూడా ఎన్నికై చట్టసభల్లో కాలుమోపలేదు. చివరగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గండ్రాత్ సుజాత, ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కొన్ని చోట్ల స్వతంత్రంగా పోటీ చేస్తున్నప్పటికీ రాజకీయ పార్టీలు కూడా మిగతా చోట్ల టికెట్లు ఇచ్చి ప్రోత్సహించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషులతో సమానంగా మహిళలు జనాభా, ఓటర్లలో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులుగా మాత్రం ఎన్నికయ్యే అవకాశం రాలేదు.

భవిష్యత్‌లో మార్పులు తప్పవు

మహిళా బిల్లుతో భవిష్యత్‌లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో మార్పులు అనివార్యం కానున్నాయి. మహిళా కోటా అమలు చేస్తే ఇప్పుడున్న పది స్థానాల్లో కనీసం రెండు నుంచి మూడు స్థానాల వరకు మహిళలకే రిజర్వు కానున్నాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీ స్థానాలు పోను, ఒక జనరల్ స్థానం ఉండనుంది. రొటేషన్ పద్ధతిలో ఉమ్మడి జిల్లా నుంచి ప్రతీ పదేళ్లకోసారి జరిగే డీ లిమిటేషన్ కమిటీ ప్రతిపాదనలతో మార్పులు చేర్పులు జరగనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని మహిళా నాయకులకు అవకాశాలు మెరుగుపడనున్నాయి.

క్లుప్తంగా

నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



పనులు పరిశీలిస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ప్రధాన మంత్రి గ్రామోదయ యోజన కింద మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉట్నూర్ మండలం ఘన్‌పూర్, రామగూడ, చింతగూడలో నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పథకం కింద మంజూరైన ప్రహరీ, మురుగు నీటి కాలువల నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. రాముగూడలో 2.5 లక్షల చొప్పున 5 పీవీటీజీ కుటుంబాలకు నిర్మిస్తున్న నివాస గృహాలను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఈఈ శివకుమార్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

పీఏసీఎస్‌ను ముట్టడించిన రైతులు

- పంటనష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్



అధికారులను నిలదీస్తున్న రైతులు

బోథ్: కేడీఎస్ 726 రకం విత్తనాలతో తెగుళ్లు సోకిన సోయా పంటలకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని రైతులు ప్రాథమిక సహకార సంఘ భవనాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలను స్థానిక పీఏసీఎస్‌లో విక్రయించారన్నారు. బోథ్ మండలంలో చాలా మంది రైతులు ఈ విత్తనాలు వేసి నష్టపోయారన్నారు. ఇప్పటికే కాయదశలో ఉన్న సోయాపంట రంగు మారి కుళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న, రైతులు కుమ్మరి ప్రభాకర్, రాసం ప్రవీణ్, రాజు, సుదర్శన్, అనిల్, వెంకటరమణ, శంకర్, గంగయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భవనాల పరిశీలన



గురుకులాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

ముధోల్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు పోలీసులు ఎన్నికల నేపథ్యంలో ఉండేందుకు బుధవారం భవనాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని పాత బాలికల గిరిజన పాఠశాల, శ్రద్ధ కాలేజీని ఆదిలాబాద్ జిల్లా రెండవ బెటాలియన్ పోలీస్ కమాండెంట్ అప్పారావు పరిశీలించారు. సిబ్బందికి అన్ని సౌకర్యాలు ఉన్న భవనాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల బందోబస్తుకు వచ్చే పోలీసులందరికీ సరిపడే భవనాలను పరిశీలించామన్నారు. ఆయన వెంట ముధోల్ ఎస్సై సాయికిరణ్, ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం :18K. Ph : 9848571888/ 9640400073 [H-189335]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462



నిర్మల్‌లో ప్రతిష్ఠించిన మట్టి గణపతి



రంజిత్ కుటుంబ సభ్యులు, బంగాల్‌పేట్, నిర్మల్



గోమయ గణపతి, న్యూసంగ్వీ, మామడ, నిర్మల్



సంగ్వీ ప్రభుత్వ పాఠశాల, దిలావర్‌పూర్, నిర్మల్

‘సెల్ఫీ విత్ గణేశ్’కు స్పందన

ఆదిలాబాద్/నిర్మల్‌టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది గణపతి మట్టి విగ్రహాలపై ‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘సెల్ఫీ విత్ గణేశ్’కు అనూహ్య స్పందన లభించింది. వినాయక చవితిని పురస్కరించుకుని పలువురు తమ ఇళ్లలో విభిన్న ఆకృతుల్లో ఉన్న మట్టి గణపతుల ప్రతిమలను ఏర్పాటు చేసుకుని భగవంతునిపై భక్తి, పర్యావరణ పరిరక్షణపై అంకిత భావం చాటుకున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి వచ్చిన వాటిలో కొన్ని..



సంగ్వీ ప్రభుత్వ పాఠశాల, దిలావర్‌పూర్, నిర్మల్



రఘు, కుంటాల, నిర్మల్



శ్రీనికేత్, సుభాష్‌నగర్, ఆదిలాబాద్



శ్రీనిక, మోచిగల్లీ, ఆదిలాబాద్



మల్లీశ్వరి, వడూర్, నేరడిగొండ



భార్గవ్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, ఆదిలాబాద్



కుంట కిరణ్ కుమార్‌రెడ్డి, నేరడిగొండ



శ్రీవల్లి, పోలీస్ కాలనీ, పిట్టలవాడ



సూర్య, హిమశ్రీ, కన్నయ్య, ఆదిలాబాద్



కళావతి, మున్సిపల్ స్వీపర్ కాలనీ, ఆదిలాబాద్

కులంపేరుతో దూషించిన వ్యక్తికి జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: కోర్టు హాలులో జడ్జి ముందే ఫిర్యాదుదారుడిని కులంపేరుతో దూషించి దాడికి పాల్పడిన వ్యక్తికి రూ.3 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు అదనపు న్యాయమూర్తి, జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ పీ.శివరాం ప్రసాద్ బుధవారం తీర్పునిచ్చినట్లు స్థానిక సీఐ రాజు తెలిపారు. ఓ ప్రైవేటు కేసు విచారణ నిమిత్తం 2017 సెప్టెంబర్14న కోర్టుకు హాజరైన స్థానిక గౌతమినగర్‌కు చెందిన బిల్లా మల్లయ్య ఫిర్యాదు దారుడైన అజ్మీర రాజేశ్ నాయక్‌ను కులంపేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడు. అప్పటి ఏసీపీలు చెన్నయ్య, ఎండీ. గౌస్‌బాబా, ఎస్సై ఆకుల అశోక్ విచారణ చేపట్టి మల్లయ్యపై కేసు నమోదు చేసి ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పీపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, లైసన్ ఆఫీసర్ సయ్యద్ తాజొద్దీన్ 9మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి డాక్టర్ పీ.శివరాం ప్రసాద్ పైవిధంగా తీర్పునిచ్చినట్లు స్థానిక సీఐ రాజు పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మావల పోలీసు స్టేషన్ పరిధిలోని బట్టిసావర్గాం గ్రామానికి చెందిన అగ్గిమల్ల మల్లేశ్ (35) 14 ఏళ్ల క్రితం నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. విసిగిపోయిన భార్య ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను తీసుకురావడానికి మంగళవారం అత్తారింటికి వెళ్లాడు. మద్యం బంద్ చేయాలని కోరడంతో ససేమిరా అని అక్కడినుంచి తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలోనే పురుగుల మందు ఇంటి ఆవరణలో కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. మంగళవారం రాత్రి అశోక్ నగర్ మసీదు ఏరియాలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన షేక్ ముజ్జు అలియాస్ సల్మాన్ , బాబుక్యాంపు బస్తీకి చెందిన చిలుముల సాగర్ పోలీసులను చూసి పారి పోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 95 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకువచ్చి బెల్లంపల్లి లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

‘బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్ల భర్తీపై అనుమానాలు’

పాతమంచిర్యాల: బాసర ట్రిపుల్ ఐటీలో ఆర్మీ ఉద్యోగుల పిల్లలు, ఎన్‌సీసీ, దివ్యాంగులకు సంబంధించిన సీట్ల భర్తీపై పలు అనుమానాలు ఉన్నాయని తెలంగాణ విద్యార్థి జనసమితి రాష్ట్ర కార్యదర్శి బచ్చలి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కేటగిరీ కింద 96 సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయక పోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. గతేడాది దివ్యాంగుల కోటాలో 35 నుంచి 40 సీట్లు భర్తీ చేసిన అధికారులు ఈ ఏడాది 14 సీట్లు భర్తీ చేసినట్లు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టారని, అందులో ఎంతమంది అడ్మిషన్లు పొందారో స్పష్టం చేయలేదన్నారు. ఆర్మీ క్రీడాకారుల కోటాలో భర్తీ చేయాల్సిన సీట్లకు రెండు మూడు సార్లు లిస్టులు పెట్టి భర్తీ చేసిన అధికారులు దివ్యాంగులకు చెందిన సీట్లకు ఒక్కసారి లిస్టు ప్రదర్శించి చేతులు దులుపుకోవడం మోసం చేయడమేనన్నారు.

వివాహిత బలవన్మరణం



రవళి(ఫైల్)

నస్పూర్: ఉరేసుకుని వివా హిత బలవన్మరణం చెందిన సంఘటన సీసీసీ న స్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం జన్నా రంకు చెందిన కుదురుపాక అంజన్న కుమార్తె రవళి (26)కి సీసీసీ నస్పూర్ సంఘం మల్లయ్య పల్లెకు చెందిన సింగరేణి ఉద్యోగి కళ్యాణం రవితో వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. సీసీసీ కార్నర్ వద్ద జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా రవళి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తండ్రి అంజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిందితులను పట్టించిన సెల్‌ఫోన్

- వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య
- ముగ్గురి రిమాండ్, పరారీలో మరొకరు..

పటాన్‌చెరుటౌన్: భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని భర్త మరో ముగ్గురితో కలిసి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 12న నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన అబ్దుల్ నదీమ్ తాహెర్ (28) పటాన్‌చెరు మండలం లక్డారం గేటు సమీపంలో జాతీయ రహదారి పక్కన హత్యకు గురయ్యాడు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. అందులో మొఘల్‌పూర్‌కు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని తెలిసింది. ఇంకా ఆమె భర్త షహజాద్‌కు ఈ వ్యవహారం రెండు నెలల క్రితమే తెలిసింది. అతడిని మందలించినా తీరులో మార్పు రాలేదు. ఇక హైదరాబాద్‌లోని టోలిచౌకిలో ఉన్న సోదరి ఇంటికి వస్తున్నాడని తెలుసుకుని హత్యకు పథక రచన చేశాడు. అందులో భాగంగా షహజాద్ తన బంధువు గౌస్ నుంచి కత్తులు, గొడ్డలి సేకరించాడు. స్నేహితులు షబ్బీర్ అహ్మద్, ఎజాజ్ అలీ సహాయం తీసుకున్నాడు. టోలీచౌకికి నదీమ్ వచ్చాడని తెలుసుకున్న అతడు ఇదే విషయమై మాట్లాడుకుని పరిష్కరించుకుందామని అందరూ ఓ హోటల్లో కలిశారు. ఇక్కడ వద్దని సంగారెడ్డిలోని ఓ దాబాకు వెళ్దామని నమ్మించారు. నదీమ్, షహజాద్ బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో లక్డారం గేటు సమీపాన వచ్చేసరికి నదీమ్ మూత్రవిసర్జనకు ఆగాడు. అక్కడ సీసీ కెమెరాలు లేవని ధ్రువీకరించుకుని అతడితో వారు గొడవ పడ్డారు. పథకం ప్రకారం గొడ్డలి, కత్తితో మెడపై దాడి చేయగా అతను అక్కడికక్కడే మరణించాడు. తర్వాత అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించారు. అయితే మరో నిందితుడు గౌస్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన క్షణికావేశం

- భార్య చేతిలో భర్త హతం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఖానాపూర్: క్షణికావేశంలో కట్టుకున్న భర్తపై గొడ్డలితో దాడి చేసిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ దబ్బెట మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన పిట్టల నడిపిరాజన్న(43) నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య లక్ష్మితో గొడవపడేవాడు. మంగళవారం రాత్రి సైతం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. అతని వేధింపులు భరించలేక ఇంట్లో ఉన్న గొడ్డలితో తలపై వేటు వేసింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసారూరల్(ముధోల్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాంగ్రి గ్రామానికి చెందిన ఆర్.సాయినాథ్ (42) భార్య సరోజిని రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్యతోపాటు ఒక కూతురు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అర్వాగార్డెన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బంగారుగూడకు చెందిన సురేష్, గంగాధర్ ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్‌కు వస్తుండగా ఆటోను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



రాకేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: పట్టణంలోని గర్మిళ్ల శివారులో రైలు కిందపడి ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏసీసీ ప్రాంతానికి చెందిన సిద్దం శ్రీనివాస్–పద్మ దంపతుల కుమారుడు రాకేశ్ (19) ఈ నెల19న రాత్రి లక్నో ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న పూసం సచిన్

ఎదులాపురం: ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కార్యదర్శి పూసమ్ సచిన్ ఆరోపించారు. తమిళనాడు రాష్ట్రంలోని నమ్మకల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ మహాసభల్లో బుధవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి వివరించారు. బంగారు తెలంగాణ అని పాలకులు చెబుతున్నప్పటికీ ఆదివాసీ గర్భిణులు వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రసవాల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, వారి హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గిరిజన భూములు దురాక్రమణ అవుతున్నప్పటికీ అధికారులు పాటించుకోవడంలేదని మండిపడ్డారు.

తండ్రికి సర్టిఫికెట్ అందించిన కూతురు



తండ్రికి సర్టిఫికెట్ అందిస్తున్న కూతురు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం గిన్నెర గ్రామానికి చెందిన మెస్రం లక్ష్మిబాయి ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు రక్తం అవసరం కావడంతో ఆస్పత్రి వైద్యురాలు రమ్యశ్రీ ఆమె తండ్రి ఇందూరి రమేశ్ దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే రమేశ్ రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నాడు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ జాదవ్‌తో కలిసి కూతురు రమ్యశ్రీ చేతుల మీదుగా రమేశ్‌కు రక్తనిధి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో మున్నూర్ కాపు డివిజన్ అధ్యక్షుడు బొడ్డు కిరణ్, ఉపాధ్యక్షులు గురజాల సత్యం, ధరణి రాజేశ్, యూత్ అధ్యక్షుడు బొడ్డు నరేశ్, జగన్, శ్రీకాంత్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎండీఎం కార్మికుల ఆందోళన



బైఠాయించిన ఎండీఎం కార్మికులు

కైలాస్‌నగర్: పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో ఏఐటీయూసీ అనుబంధ ఎండీఎం కార్మికులు బుధవారం విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికులకు పెంచిన వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పది నెలలుగా కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు వచ్చాయని చెబుతున్న డీఈఓ ఇప్పటి వరకు వాటిని ఎందుకు చెల్లించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, రాంబాయి, పుష్పలత, నాగమణి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ అస్తిత్వాన్ని దెబ్బతీయవద్దు



మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

బోథ్: జిల్లా ఉన్నతాధికారులు బోథ్ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా నిర్ణయాలు తీసుకోరాదని అఖిలపక్షం నాయకులు పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఇచ్చోడలో ఏర్పాటు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రం బోథ్ ఉండగా వేరేచోట ఎందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, టీడీపీలు సమావేశాన్ని బహిష్కరించాయి. ఇప్పటికే బోథ్ అస్తిత్వం కాపాడాలని ఒకవైపు ఉద్యమం చేస్తుంటే ఉన్నతాధికారులు బోథ్ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఇకపై సమావేశాలను బోథ్‌లోనే ఏర్పాటు చేయాలని డిప్యూటీ తహసిల్దార్ ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్, బీజేపీ నాయకులు వెంకటేశ్, సీపీఐ నాయకులు షేక్ షాకీర్, టీడీపీ నాయకులు అబూద్, తదితరులు పాల్గొన్నారు.

‘కంది’ అనుచరులపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. పోలీసు స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఆయన అనుచరులు బుధవారం కుక్కర్ల పంపిణీ కోసం రోడ్డుపై టెంట్ వేశారు. ఆ రోడ్డు గుండా రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరించారు. దీంతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

బోథ్: మండలంలోని కోట గ్రామానికి చెందిన కిరానే రమేశ్‌కు చెందిన ద్విచక్రవాహనం బుధవారం చోరీకి గురైంది. సొనాల గ్రామంలో బుధవారం సంత కావడంతో వాహనాన్ని నిలిపి సరుకులు కొనడానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి వాహనం లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

మాజీ సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 2014–15 ఆర్థిక సంవత్సరంలో బీఆర్‌జీఎఫ్ (బ్యాక్‌వర్డ్ రీజియన్స్ గ్రాంట్ ఫండ్) నుంచి రూ.4.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా మాజీ సర్పంచ్ కొమ్మెర వీణ నిధులను దుర్వినియోగం చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గజెల్లి రాజ్‌కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన కలెక్టర్ మాజీ సర్పంచ్ వీణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.